క్లుప్తంగా

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

జగిత్యాలక్రైం: వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని రూరల్ ఎస్సై అనిల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ పెట్టుకోవాలని, అలాగే డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, నంబర్ ప్లేట్ మార్చడం, తొలగించడం చేస్తే చట్ట ప్రకారం వాహనం సీజ్ చేస్తామన్నారు.

బీర్‌పూర్‌లో డీఎల్‌పీవో విచారణ



గ్రామపంచాయతీలో విచారిస్తున్న డీఎల్‌పీవో

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పై ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేయగా, శుక్రవారం డీఎల్‌పీవో కనకదుర్గ విచారణ చేపట్టారు. గ్రామంలో ఇళ్ల అనుమతులు, కల్యాణలక్ష్మి కోసం వివాహ ధృవీకరణ పత్రాలు, వంటి వాటిపై కార్యదర్శి ఎక్కువ మొత్తంలో వసూళ్లు చేస్తున్నాడని, గ్రామానికి చెందిన యువచైతన్య యూత్ సభ్యులు మార్చి 27న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, గ్రామస్తులు, యూత్ సభ్యులు ఉన్నారు.

రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుకాఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం జరిగిన ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సన్మానించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కొడిమ్యాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గూడ లింగారెడ్డి, నాయకులు బేతి పూర్ణచెందర్‌రెడ్డి, బోగ గంగారాం, సూర గంగారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు



కొనుగోలు పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్

వెల్గటూర్: అకాల వర్షాల వల్ల నష్టపోయి రైతులు ఎవరూ అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్ అన్నారు. శుక్రవారం ఎండపల్లి మండలం గుల్లకోట ఐకేపీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లర్లు ధాన్యాన్ని తొందరగా దిగుమతి చేసుకోవడం లేదని రైతులు తెలపగా, మిల్లర్లతో మాట్లాడి ధాన్యం దిగుమతి చేయడంలో అలసత్వం చేయవద్దని కోరారు. మార్కెట్ కమిటీ కార్యదర్శిని రైస్‌మిల్లులకు పంపించి పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించేలా ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తేమశాతం పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ బాలే శివాజీ కోరారు. మండలంలోని గోధూర్, యామాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తేమశాతం వచ్చిన వడ్లను వెంటనే తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఎంపీవో కృపాకర్, ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు జాప్యం.. రైతులకు శాపం

- వరుసగా కురుస్తున్న వర్షాలతో తడిసిన ధాన్యం
- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే నిరీక్షణ



వర్షం భయంతో ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు

కథలాపూర్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతన్న వాటిని అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నాడు. వరి కోసి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. ధాన్యం మాయిశ్చర్ రావడానికి ఆరబెట్టి, తాలు లేకుండా జాగ్రత్తలు పడ్డారు. తీరా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగి వడగండ్ల వానతో ధాన్యం తడిసిముద్దయింది. దీంతో ఆరుగాలం శ్రమించి నష్టపోయామని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

మండలంలో 29 కొనుగోలు కేంద్రాలు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. ఈ సీజన్‌లో 22 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. దిగుబడి సుమారుగా 6.16 లక్షల క్వింటాళ్లు వస్తుందని అధికారులు అంచనా వేశారు. మండలంలో 29 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెర్ప్ ఆధ్వర్యంలో 11 కేంద్రాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలను అప్పట్లోనే ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో తూకం ప్రారంభించగా.. మరికొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంతో రైతులు నిరీక్షిస్తున్నారు. వారం రోజులుగా వడగళ్లు, ఈదురుగాలులతో వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యంను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితుల్లో రాత్రనకా, పగలనకా కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షిస్తున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ధాన్యం తడిసి మొలకలు వచ్చాయని రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేగవంతం చేస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, జాప్యం చేస్తే మరింత ధాన్యం వర్షానికి తడిసిపోతుందని రైతులు భయపడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి తూకంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

25 రోజుల కిందట ధాన్యం తీసుకొచ్చా



వరిపంటను కోసి 25 రోజుల కిందట ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చా. తూకం వేయకపోవడం, వరుసగా వర్షాలు కురియడంతో ధాన్యం తడిసింది. టార్పాలిన్ కవర్లు కప్పినా భారీ వర్షంతో ధాన్యం మొలకెత్తింది. ఇట్లయితే రైతులు పడిన శ్రమ వృథా అయినట్టే. కొనుగోళ్లు వేగవంతం చేయాలి.

– గడ్డం స్వామిరెడ్డి, రైతు, భూషణరావుపేట

కొనుగోలు కేంద్రంలోనే నిరీక్షిస్తున్నా..



వరి కోసి 12 రోజులైంది. ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన. ఇప్పటికీ తూకం వేస్తలేరు. వర్షానికి ధాన్యం తడిసింది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియడంలేదు. ప్రతీరోజు ధాన్యం ఆరబెడుతూ కొనుగోలు కేంద్రంలోనే నిరీక్షిస్తున్నా. త్వరగా తూకం వేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కోరేపు సాయన్న, రైతు, కథలాపూర్

నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తాం



నిబంధనల ప్రకారం వరిధాన్యంలో 17 శాతం లోపే తమే ఉంటేనే తూకం వేస్తారు. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోసిన ధాన్యంకు సీరియల్ నెంబర్లు కేటాయించారు. వరుస సంఖ్య ప్రకారం తూకం వేయాలని సిబ్బందికి సూచించాం. రైతులు సహకరించి ధాన్యంను ఆరబెట్టాలి. కొనుగోళ్లు వేగవంతం చేస్తాం.

– నరహరి, సెర్ప్ ఏపీఎం, కథలాపూర్

కొనసాగుతున్న కార్యదర్శుల సమ్మె



రాయికల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న జేపీఎస్‌లు

పెగడపల్లి: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా శుక్రవారం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సమ్మెలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు నదీం, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఒంటికాలుపై నిల్చుని నిరసన

రాయికల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ శుక్రవారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌లు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు అక్బర్, అపర్ణ, రాజశ్రీ, నవ్యశ్రీ, వినోద్, వేణు, రాజేశ్, అశోక్, వెంకటేశ్, నరేశ్, మౌనిక, దివ్య, వనిత పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి..

కోరుట్ల రూరల్: పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం రోడ్లు శుభ్రం చేసి వినూత్నంగా నిరసన చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల జూనియర్ పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి..

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం వెంటనే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కొరుతూ శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ పిల్లలతో కలిసి ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

సర్పంచుల సంఘీభావం

బుగ్గారం: పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మండల సర్పంచులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

మేడిపెల్లి: పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించి, సిబ్బంది వేతనాలను పెంచాలని కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, కారోబార్లు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, దామోదర్, రమేశ్‌రెడ్డి, సురేందర్ తదితరులు ఉన్నారు.

కారోబార్లు, బిల్ కలెక్టర్ల సమ్మె

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, పంచాయతీ సిబ్బంది తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం సమ్మె చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె చేస్తామని కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, పంచాయతీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జిల్లపెల్లి రమేశ్, నిరేటి రతన్, మర్రిగడ్డ జగన్, బట్టు గంగాధర్, బిక్కునాయక్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

రజకుల కోసం మోడ్రన్ ధోబీఘాట్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అధికారులు, రజకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పట్టణంలోని రజక కులస్తుల కోసం మోడ్రన్ ధోబీఘాట్ మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో రజక కుల సంఘ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. వెంటనే స్థలం ఎంపిక చేసి పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ డాక్టర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, కౌన్సిలర్లు, తహసీల్దార్ రాజేందర్, ఏఈ చరణ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆత్మరక్షణ తప్పనిసరి

విద్యతో పాటు ఆత్మరక్షణ తప్పనిసరి అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ శిక్షకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరాటే శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో కరాటే శిక్షణశిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని, కరాటేతో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం పెరిగి చదువులో సైతం రాణించే అవకాశం ఉందన్నారు. బాలసదన్‌లోని అనాథ పిల్లలకు కరాటే కోచింగ్ అవకాశం కల్పించేలా అధికారులు చూడాలని, నావంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నరేశ్, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాజ్‌కుమార్, నక్కల రాధ పాల్గొన్నారు.

చాలీసా పారాయణంలో ఎమ్మెల్యే దంపతులు

మల్యాల: శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ హనుమాన్ చాలీసా పారాయణంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ – రాధిక దంపతులు పాల్గొని, పారాయణం చేశారు. అంతకుముందు ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సన్మానించి, స్వామివారి తీర్థ, ప్రసాదం, ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు దావ సురేశ్ తదితరులున్నారు.

సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



మల్లాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

జగిత్యాల: వైద్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ఎంతో అభినందనీయమన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి కాంట్రాక్ట్ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎల్‌టీ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు రవీందర్, కృష్ణారావు, శ్రీనివాస్‌లతో పాటు ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై రాయికల్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని, మా బాధ్యతను గుర్తించి సీఎం కేసీఆర్ క్రమబద్ధీకరించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీశ్, ఫార్మాసిస్ట్ జంషీద్ అలీ, ఖలీల్, ల్యాబ్ టెక్నీషియన్లు సంతోష్‌కుమార్, భూమయ్య, నవకుమార్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఎన్సీడీ స్టాఫ్ నర్స్ హేమ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: పెద్దపల్లి జిల్లాలోని రహింఖాన్‌పేట మోడల్ స్కూల్‌లో పీజీటీ(మ్యాథ్స్)గా పనిచేస్తున్న బైరెడ్డి రజిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి శుక్రవారం మల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రూ.48,400ల ఆర్థికసాయం అందించారు. మొగిలిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జంగ గంగాధర్ నేతృత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువతులకు చేయూత

జగిత్యాల: పట్టణంలోని వంజరివాడకు చెందిన సింధూజ, వరలక్ష్మికి ఇటీవల వివాహం నిశ్చయం కాగా, వారి ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన సత్య సాయి సేవా సమితి సభ్యులు రూ.22 వేల ఆర్థిక సాయం అందజేశారు. వివాహానికి వెండి మెట్టెలు, పెళ్లి చీర, మంగళహారతి, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్, లక్ష్మీనారాయణ, ఆనంద్, ప్రతాప్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కొడిమ్యాల: మండలంలోని పూడూరులో ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ మేనేని నర్సింగారావు, నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ప్రసాద్, వెంకటేశ్, రాజేశం పాల్గొన్నారు.

బుద్ధ జయంతి వేడుకలు

మెట్‌పల్లి: పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న అంబేద్కర్ సంఘం భవనంలో శుక్రవారం బుద్ధిష్ట్ సొసైటీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బుద్ధుని బోధనల గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలుడి మృతి

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యోఖీన్‌పూర్‌లో ఎల్లాల శయన్‌రెడ్డి (9)అనే బాలుడు శుక్రవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే బాలుడు వారం రోజులుగా బావిలోకి ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నాడు. గురువారం బాలుడికి తీవ్ర తలనొప్పి రావటంతో కోరుట్లలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు కరీంనగర్ పంపించారు. స్కానింగ్ రిపోర్టులో ఇంటర్నల్ బ్లీడింగ్ ఉన్నట్లు తేలింది. అప్పుడు బాలుడు తాను కింద పడ్డానని తలకు దెబ్బ తగిలిందని చెప్పాడు. ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లి: మండలంలోని మేడిపల్లిలో శుక్రవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరిపి ఆ తర్వాత వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. దీనికి పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల సంజయ్, జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. పల్లకీ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిద్రాల భూమయ్య, కోటగిరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గీతాశ్రమ వార్షికోత్సవం..

ధర్మపురి: మండలంలోని తీగల ధర్మారంలోని గీతాశ్రమమంలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణ భగవానునికి అభిషేకం, గోపూజ, తులసి పూజ, ధ్వజారోహణ ఆవిష్కరణ, గీత యజ్ఞము తదితర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అండాలు, ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, యజ్ఞ నిర్వాహణకర్త రామ్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర శతకలశాభిషేకం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 108 అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య హోమం, దీపోత్సవం, పూలంగి సేవ, తులాబారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో నూతనంగా నిర్మించిన మల్లన్న స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల బహిరంగ వేలం

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన ఏడాది కాలానికి గాను ఆలయంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముటకు, కొబ్బరిముక్కలు పోగు చేసుకొనుటకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు, పూజాసామగ్రి టెండర్ కోసం రూ. 3లక్షలు, కొబ్బరికాయలు పోగుచేసుకునేందుకు రూ.30 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనగలరని ఈవో పేర్కొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరునికి క్షీరాభిషేకం

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయం శ్రీ వేకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీహవనం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

వైభవంగా ధనలక్ష్మీ కల్యాణం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న సూర్యనారాయణ ధనలక్ష్మీ సహిత ధన్వంతరి ఆలయంలో శుక్రవారం ధనలక్ష్మీ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేల సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, శంకర్, తౌటు రాంచందర్, ఎన్నాకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతోనే భవిష్యత్ తరాలకు వెలుగు

మల్యాల: విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ రోజుకు ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే భవిష్యత్ తరాలకు వెలుగుల బాట వేసినవారవుతారని మల్యాల విద్యుత్‌ఏఈ కొమ్ము కమలేశ్వర్ అన్నారు. ముత్యంపేట, తక్కళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ వినియోగదారులు, రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి, కుమారస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకరణాలకు ఎర్తింగ్ ఉండాలి

గొల్లపల్లి: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలన, ఇంట్లో అన్ని ఉపకరణాలకు ఎర్తింగ్ తప్పకుండా చేయాలని విద్యుత్ ఏఈ దివాకర్ రావు అన్నారు. మండలంలోని అగ్గిమల్ల లో విద్యుత్ ప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ దామోధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు.

జగిత్యాల మండల పరిధిలో..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధి, పొలాస సబ్‌స్టేషన్ పరిధిలోనిగ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాలు మండల కేంద్రంలోనే నిర్మించాలి

బుగ్గారం: మండల కేంద్రంలోనే ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని బుగ్గారం గ్రామసభ తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ,గ్రామప్రజలు సమావేశమై గ్రామానికి సంబంధించిన పలు తీర్మానాలు చేశారు. వీటిలో ముఖ్యంగా మండల కేంద్రం నడిబొడ్డున గల సదాశివరావుకు చెందిన గడీ స్థలంలోనే మండల కార్యాలయాలు నిర్మించాలని తీర్మానించారు.అలాగే మహాలక్ష్మీ బోరు వద్ద స్థలంలో పోలీస్‌స్టేషన్ నిర్మించడంతో పాటూ బలిదేవరగుట్టబోరును పూర్తిగా చదును చేసి హద్దులు నిర్ణయించి గ్రామావసరాలకు ఉపయోగపడేవిధంగా మార్చాలని నిర్ణయించారు. వీటితో పాటు గ్రామాభివృద్ధికి అవసరమైన పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల సుమలత, వైస్ ఎంపీపీ సుచేందర్, వార్డు సభ్యులు,కులసంఘాల అధ్యక్షులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల: ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను నిరుద్యోగ, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మల్యాల మండల ప్రతిమ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సల్మాన్ తెలిపారు. మండలంలోని 18–30 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులకు టైలరింగ్, ఏసీ మెకానిక్, సోలార్ టెక్నీషియన్,రిటైల్స్ సేల్స్, బ్యాంకింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి, హాస్టల్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హతల జిరాక్స్‌లతోపాటు ఒక ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ 9000305205 నంబర్‌లో సంప్రదించి, రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.